క్లుప్తంగా

నాగారాన్ని మండలముగా ఏర్పాటు చేయాలి

ధారూరు: నాగారం గ్రామాన్ని కొత్త మండలముగా ఏర్పాటు చేయాలని ధారూరు మండల దళిత శక్తి ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాస్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని తాండూర్, పరిగి, కొడంగల్, వికారాబాద్ పట్టణాలకు వెళ్లడానికి ఈ గ్రామం అనువుగా, జంక్షన్‌గా ఉందని ఆయన పేర్కొన్నారు. నాగారం పరిధిలో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయని, సుమారు 25 గ్రామాలు, తండాలకు మధ్యలో ఉందని తెలిపారు. మండలముగా నాగారం ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజలకు పరిపాలన సౌలభ్యం అవుతుందని వెల్లడించారు. ఎమ్మెల్యే ఆనంద్, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

శివలింగానికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీపీ

కొడంగల్ రూరల్: మహాదేవుని ఆలయంలో మంగళవారం శివ భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ కుటుంబసభ్యులు శివలింగానికి పంచామృతాభిషేకం, శివాష్టకం, లింగాష్టకం జరిపారు. అనంతరం గురుస్వామి గడ్డం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శివలింగానికి శివస్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు.

పోచమ్మతల్లికి పూజలు

ధారూరు: కొండాపూర్‌కలాన్ గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పోచమ్మతల్లి మొదటి వార్షికోత్సవ పూజలను బీఆర్ఎస్ నాయకులు, సర్పంచి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడు వడ్లనందు, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జైదుపల్లి హన్మంత్‌రెడ్డి, సర్పంచి పరమేశ్, ఉప సర్పంచి యాదయ్య, గ్రామస్తులు అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

బర్త్‌డేకు పిలిచి బాదేశాడు!

- తాగిన మైకంలో బంధువులపై దాడి
- ఇంట్లో వేసి తాళం వేసిన వైనం

అనంతగిరి: తన కుమారుడి బర్త్‌డే ఉందని బంధువులందరికీ దావత్ ఇచ్చాడు. అనంతరం తాగిన మైకంలో వచ్చిన బంధువులపై దాడి చేసిన సంఘటన వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నవీన్‌కుమార్.. తన కొడుకు బర్త్‌డే కోసం సోమవారం రాత్రి సమీప బంధువులను, సన్నిహితులను పిలిచి వేడుక జరిపాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. తాగిన మైకంలో నవీన్.. బంధువైన రాజును కారు ఇవ్వమంటూ హల్‌చల్ చేశారు. వారించేందుకు వచ్చిన బంధువులపై కర్రతో దాడి చేశాడు. ఇట్లోంచి ఎవరూ బయటకు వెళ్లకుండా గేటుకు తాళం వేసి హంగామా చేశాడు. దీంతో వారు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పుస్తక భాండాగారం సిద్ధం



నూతన గ్రంథాలయ భవనం

కొడంగల్: పట్టణంలోని సంతబజార్‌లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చొరవతో నిర్మించిన శాఖా గ్రంథాలయ నూతన భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పాఠకులకు సౌకర్యంగా ఉండాలనే ఉద్దేశంతో అత్యాధునికంగా భవనం నిర్మించామని, త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

టైం పే స్కేలు వర్తింపజేయాలి

అనంతగిరి: ఉపాధిహామీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే టైం పే స్కేలు విధానం వర్తింపజేయాలని యంజీఎన్ఆర్ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటించి..

కొడంగల్ రూరల్: యాసంగిలో రైతులు తమ పంటలకు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ.. సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామ శివారులో పంట పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. పంటకు పట్టిన చీడ పీడలను పరిశీలించి, పంట సేద్యంపై అవగాహన కల్పించారు. మూస పద్ధతిలో కాకుండా.. భూసారం, పంట మార్పిడి వంటి వాటిని పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అలాగే పంట వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేస్తూ ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ బాలాజీ ప్రసాద్, ఏఈఓ మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

ఫలితాలు ‘పది’లమేనా?

‘పది’లో మునపటి కంటే మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయబృందం రేయింబవళ్లు శ్రమిస్తోంది. విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. అందుకు ప్రభుత్వ ప్రోత్సాహకం ఎలా ఉన్నా.. మాధ్యమం ఏదైనా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు రాబట్టి, సర్కారు బడులకు బలమైన పునాది వేసే దిశగా పయనించడం గమనార్హం.

- టెన్త్ రిజల్ట్స్‌పై ఉపాధ్యాయుల కృషి
- ఉన్నత పాఠశాలల విద్యార్థుల వెనుకంజ
- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి



పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల బోధన

బొంరాస్‌పేట: టెన్త్ టెన్షన్ మొదలైంది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పదో తరగతి ఉత్తీర్ణత, ఫలితాల ప్రణాళికలు మొదలు పెట్టారు. ఏటా మండలంలో ఇదివరకు పదిలో ఉత్తీర్ణత శాతం 90 ఉండగా.. ఈ ఏడాది వందశాతం సాధించేందుకు పాఠశాలల వారీగా కృషి చేస్తున్నారు. ఈసారి బొంరాస్‌పేటతో పాటు నూతనంగా ఏర్పడిన దుద్యాల మండలంలోనూ ప్రత్యేక తరగతులతో బోధన నిర్వహణ, పకడ్బందీ ప్రణాళికలతో శ్రద్ధ చూపుతున్నామని ఉపాధ్యాయులు చెబుతుండగా.. ఏటా ఉన్నత పాఠశాలల్లో చదువుకునే పదో తరగతి విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం క్రమంగా తగ్గుతూ వస్తోంది.

బొంరాస్‌పేటలో..

ఈ విద్యాసంవత్సరంలో మాధ్యమాల వారీగా బొంరాస్‌పేట జెడ్పీహెచ్ఎస్‌లో 132 మందికి గానూ.. ఆంగ్లం 51, తెలుగు 81, చౌదర్‌పల్లిలో 58 మందికి గానూ ఆంగ్లం26, తెలుగు32 మంది విద్యార్థులున్నారు. రేగడిమైలారం ఉన్నత పాఠశాలలో 20, బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 41మంది తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారు. ఇదివరకు పది ఫలితాల్లో ఆశ్రమపాఠశాల గిరిజన విద్యార్థిని కోమల్ 9.7తో మండల టాపర్‌గా నిలిచింది. ఈసారి జీపీఏను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

దుద్యాలలో..

దుద్యాల జెడ్పీహెచ్ఎస్‌లో 63 మంది విద్యార్థులుండగా ఆంగ్లం33, తెలుగు30 మంది, చెట్టుపల్లితండా కస్తూర్బాలో బాలికల పాఠశాలలో 35 మంది తెలుగు మీడియంలో ఉన్నారు. అలాగే హకీంపేట, కుదురుమళ్ల ఉన్నత పాఠశాల్లో టెన్త్ విద్యార్థులున్నారు. ఈ విద్యాసంవత్సరంలో అక్టోబర్ నుంచి పదో తరగతికి ప్రత్యేక తరగతుల ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి చేసి జనవరి నుంచి పరీక్షల సరళి, సమాయత్తం కార్యక్రమాలతో విద్యార్థులను సంసిద్ధులను చేసే పనిలో ఉన్నారు. రేగడిమైలారం ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు ఒకే ఒక్క ఎస్ఏ పోస్టు ఉండగా.. పాఠశాలలోని ఎస్జీటీ ఉపాధ్యాయులు పదోతరగతికి పాఠాలు చెబుతూ సన్నద్ధం చేస్తున్నారు. పెద్ద సంఖ్య ఉన్న మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆంగ్లం, తెలుగు మాధ్యమ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. టీచర్ల వారీగా బాధ్యతలు, ప్రణాళిక పట్టిక తయారు చేసి పాఠాలు బోధిస్తున్నారు.

ప్రత్యేక బాధ్యతలు



పాఠశాలలో ఎస్ఏ ఒకటే ఉంది. అందుకని ఉపాధ్యాయుల కొరత విద్యార్థులకు ఇబ్బందిగా మారకూడదని ఎస్జీటీ ఉపాధ్యాయులమంతా పదో తరగతి విద్యార్థులకు రెండేళ్లుగా ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నాం. ఫలితాలు సాధిస్తున్నాం. ప్రభుత్వ గురుకుల కళాశాల్లోనూ సీట్లు సాధిస్తున్నాం.

– అనితాబాయి, ఎస్జీటీ, రేగడిమైలారం

క్యాంపునకు పంపాం..



టెన్త్‌లో గతేడాది మా పాఠశాల నుంచి 9.7జీపీఏలో మండల టాపర్‌గా నిలవడం గర్వంగా ఉంది. డ్రాపవుట్ విద్యార్థులు ఎక్కువగా ఉండే స్కూళ్లలో సాధారణ విద్యార్థుల కంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకోక తప్పదు. ఈసారి స్టూడెంట్స్‌కు టైమ్‌టేబుల్ చేసి, ప్రత్యేక క్యాంపునకు పంపాం.

– విక్రమ్‌సింగ్, హెచ్ఎం, ఆశ్రమ పాఠశాల

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు..



ఇదివరకు ఎస్సెస్సీలో మండలం 91శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈసారి పర్సంటేజ్ పెరగనుంది. ఈ సారి టీచర్ల కొరత తీరింది. ఎస్ఏ, ఎస్జీటీలు, వీవీల సంఖ్య అనుకూలంగా ఉంది. డిజిటల్ బోధన కూడా కొనసాగుతోంది. డిజిటల్, ప్రత్యేక తరగతుల బోధన స్టూడెంట్స్‌కు ఉపయోగకరంగా ఉంది.

– కె.రాంరెడ్డి, ఎంఈఓ

ప్రధాన రోడ్డుపైనే మురుగు

ఆలయ సమీపంలో అసౌకర్యం



సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు

ధారూరు: ధారూరు నుంచి వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలకు వెళ్లే ప్రధాన రహదారి అది. ఈ దారిలోని ఓ గ్రామం రోడ్డు మలుపులో నిత్యం రోడ్డుపై నీరు నిలిచి అసౌకర్యంగా మారింది. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నా.. జీపీ సిబ్బంది, కార్యదర్శి ఎవరు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ధారూరు నుంచి వయా దోర్నాల్, నాగారం మీదుగా పరిగి, వికారాబాద్, కొడంగల్ మండల కేంద్రాలకు వెళ్లాలంటే నాగారం గ్రామ మైసమ్మ గుడి సమీప రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని దాటి వెళ్లాల్సిందే. రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ తరచూ పగిలిపోయి నీటి లీకేజీ అవుతుండగా.. సంబంధిత సిబ్బంది తాత్కాలిక మరమ్మతు చేయడం.. మూణ్నాళ్లకే మరమ్మతుకు గురికావడం.. నీరు రోడ్డుపైకి చేరి బురదమయంగా మారడం ఇలా నిత్యకృత్యంగా మారింది. దీంతో రోడ్డుపై నీరు నిలిచి స్థానికులకు అసౌకర్యంగా మారింది. అక్కడే మలుపు ఉండడంతో ద్విచక్రవాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సత్వరమే స్పందించి లీకేజీని అరికట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రీడాకారులకు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

పరిగి: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జింకానా గ్రౌండ్‌లో కే.ఎస్.ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీకి ఆయన హాజరయ్యారు. పోటీల్లో వికారాబాద్, నయారా11 టీంలు తలపడగా.. నయారా జట్టు 31 పరుగులతో విజయం సాధించింది. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్ష, రెండో స్థానంలో నిలిచిన టీంకు రూ.50 వేలు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆర్.ఆంజనేయులు, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



పూడూరు: స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూడూరు: కడుమూరు ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిపాలన దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మధు, కృష్ణ, ఉపాధ్యాయులు అనూష, హరీశ్, రాంప్రసాద్, శ్రీనివాస్, విఠల్, ఖాజామోహినోద్దిన్, శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..



కుల్కచర్ల: కల్మన్‌కాల్వ పాఠశాలలో..

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం కల్మన్‌కాల్వ గ్రామం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వయం పరిపాలన దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ, కలెక్టర్‌గా వ్యవహరించారు.

జాతీయ రహదారిపై వంతెన

- భూ సేకరణకు అధికారుల పరిశీలన
- బైపాస్ నిర్మాణానికి రూట్ మ్యాప్ సిద్ధం



వంతెన నిర్మించే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ఇదే

కొడంగల్: మహబూబ్‌నగర్-చించోలీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొడంగల్‌లో బైపాస్ నిర్మించనున్నారు. ఈ బైపాస్ అలైన్‌మెంట్ ప్రకారం మరో జాతీయ రహదారి అయిన బీజాపూర్-హైదరాబాద్ రోడ్డును క్రాస్ చేయాల్సి ఉంది. ఈ రెండు రహదార్లు కలిసే చోట రాకపోకలకు అంతరాయం ఉండకూడదనే ఉద్దేశంతో జాతీయ ఉపరితల రహదారుల శాఖ ఫ్లై ఓవర్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భూ సేకరణ కోసం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం బైపాస్ పొడవు నాలుగు కిలోమీటర్లు, వెడల్పు 100 ఫీట్లు ఉండగా.. అందులో ఫ్లై ఓవర్ నిర్మించే ప్రాంతంలో 150 ఫీట్ల రోడ్డు నిర్మించనున్నారు. వంతెనతో పాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ఫ్లైఓవర్ నిర్మాణం హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి పైనుంచి వెళ్లగా.. ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేయనున్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి అనుసంధానంగా ఉంటాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ శివారు నుంచి బైపాస్ ప్రారంభం అవుతుంది. పట్టణానికి తూర్పు దిక్కు నుంచి ఉత్తర భాగం మీదుగా పడమర దిక్కు వరకు బైపాస్ విస్తరించనుండగా.. కోస్గి రోడ్డులోని భారత్ పెట్రోల్ పంపు సమీపం నుంచి బైపాస్ ప్రారంభం అవుతుంది. మురహరి ఫంక్షన్ హాల్ పక్క నుంచి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి మీదుగా బైపాస్ వెళ్లి తాండూరు రోడ్డుకు కలిసి ముగుస్తుంది. బైపాస్ నిర్మాణానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. త్వరలో భూ యజమానులకు నోటీసులు ఇచ్చి భూ సేకరణ చేయనున్నారు.

బీఆర్ఎస్‌పై ప్రజలకు భరోసా లేదు

- కేసీఆర్‌ది అవినీతి పాలన
- ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ ఎంపీ రవీంద్రనాయక్ మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

అనంతగిరి: బీఆర్ఎస్‌పై ప్రజలకు భరోసా లేదని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకులు రవీంద్ర నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలన పూర్తిగా అవినీతి మయమని ఆరోపిస్తూ.. అణచివేత ధోరణితో కొనసాగుతుందని మండిపడ్డారు. కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఇలాంటి పాలనకు విముక్తి కల్పించడానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ దురాంహకార దొర అని తాను మొదట్లోనే చెప్పానని, అది నేడు నిజమయిందని గుర్తుచేశారు. ఆయన ముందుగా అమరవీరులను మరిచిపోయేలా చేయడంతో పాటు, ఆస్తులు, పదవులు త్యాగం చేసి తెలంగాణ ఉద్యమం చేసిన వారి రాజకీయ జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. మోదీ పాలన నేడు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందుతుందని, గిరిజన ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీజేపీని ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, ప్యాట శంకర్, సురేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని అమలు చేయండి

అనంతగిరి: పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని టీవీఈయూ హెచ్ 82 యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ డీఈ కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. అనంతరం డీఈకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం చేయకుండా ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యాలు వెంటనే స్పందించి పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ అభ్యున్నతికై ఎల్లవేళలా ఆరాటపడుతున్నామని, ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్, హమీద్, అమిత్, వెంకట్‌రాంరెడ్డి, రాజ్‌కుమార్, గులాం, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి

కొడంగల్ రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలనకు వచ్చిన ఆయన పలు సూచనలు చేశారు. కొంత సమయం యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బందితో ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

తాండూరు: పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోంలో రేపు(గురువారం) ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నర్సింగ్ హోం ఎండీ డాక్టర్ సంపత్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ వైద్య శిబిరానికి హైదరాబాద్ యశోదా హాస్పిటల్ వైద్య నిపుణులు హాజరై ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, మెదడు, నరాలకు సంబంధించిన వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని వెల్లడించారు. కావున ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అపాయింట్‌మెంట్ ముందుగానే.. 915 4975 821 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

దోమ: రైతులు సాగు చేసే పంటల్లో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా గణాంకాల అధికారి జలేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శివారెడ్డిపల్లిలో గ్రామానికి చెందిన సరస్వతి పొలంలో శనగ పంటను అంచనా వేశారు. పంటను ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు తీసుకొని అంచనా వేయగా 4.500 కిలోలు వచ్చిందన్నారు. సాగులో మెలకువలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని చెప్పారు.

ఆర్డీఓపై ఫిర్యాదు

తాండూరు: ప్రొహిబిటెడ్ నుంచి భూమిని తొలగించేందుకు ఆర్డీఓ అశోక్‌కుమార్ రూ.4లక్షలు తీసుకున్నారంటూ మున్సిపల్ కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వరాల శ్రీనివాస్ రెడ్డి సీసీఎల్ఏ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో ఆర్డీఓపై ఫిర్యాదు చేశారు. భూ సమస్య పరిష్కరించలేదని, తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని పేర్కొంటూ ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

భాస్కరయోగికి సాహిత్య పురస్కారం



సాహిత్య పురస్కారం అందుకుంటున్న భాస్కర యోగి

పరిగి: తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు తెలుగు యూనివర్సిటీ- 2020 సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ఈ మేరకు పరిగి పట్టణానికి చెందిన డాక్టర్. పి.భాస్కర యోగికి హిందువుల పండుగలు అనే వచన రచన గ్రంథానికి గుర్తింపు లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కిషన్‌రావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ డాక్టర్ బి.జనార్దన్ రెడ్డి, సంచాలకులు, విశిష్ట అతిథి వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు, చిత్రంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వికారాబాద్ అర్బన్/అనంతగిరి: సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ గిరిజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 15న గురిజనులు సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో భోగ్ భాండార్ కార్యక్రమాన్ని జరుపుతారని, ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఆన్ డ్యూటీ సెలవు (ఓడి) ఇవ్వాలని వారు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పాండు నాయక్, ప్రధాన కార్యదర్శి రవినాయక్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

పరిగి: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన పరిగి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ పట్టణానికి చెందిన మహమ్మద్‌షఫీ తన వాహనంలో పరిగి నుంచి తాండూర్‌కు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, వెంటనే రూప్‌ఖాన్‌పేట్ గ్రామ గేట్ సమీపంలో వాహనాన్ని పట్టుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాహనాన్ని ఠాణాకు తరలించి, షఫీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.